నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 16 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

సాగునీళ్లివ్వకుంటే చావే శరణ్యం

జూరాల ప్రాజెక్టుపై కంప అడ్డం వేసి ఆందోళన చేస్తున్న రైతులు

- 15 రోజులు నీళ్లిస్తే పంటలు చేతికొస్తయి
- అప్పులు చేసి 35వేల ఎకరాల్లో వరిసాగు చేసినం
- జూరాల ప్రాజెక్టు వద్ద రైతుల ఆందోళన
- 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని డిమాండ్
- నిలిచిపోయిన వందలాది వాహనాలు
- పోలీసులు, రైతుల మధ్య స్వల్ప ఉద్రిక్తత
- కలెక్టర్ల హామీతో ఆందోళన విరమణ

అమరచింత, ఏప్రిల్ 15 : లక్షలు అప్పులు తెచ్చి పంటలు సాగుచేసినం.. ఇంకో 15 రోజులైతే పంటలు చేతికొస్తయి.. ఈ టైంలో నీళ్లు ఇవ్వక పోతే చేసిన అప్పులు తీర్చలేక తమకు చావే శరణ్యమని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద ప్రధాన రహదారికి అడ్డంగా బారి కేడ్లతోపాటు ముళ్లకంప అడ్డంగా వేసి ఎండను సైతం లెక్కచేయకుండా గంటకు పైగా బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ పరిధిలో 35వేల ఎకరాల్లో పంటలు సాగు చేశామని, రెండు వారాల పాటు సాగునీరు విడుదలైతేనే పంటలు గట్టెక్కుతాయని తెలిపారు. లేదంటే రూ.కోట్లల్లో నష్టం జరిగి చేసిన అప్పులు తీర్చలేక తమకు చావులే శరణ్యమని ఆందోళలో పాల్గొన్న మస్తీపుల్, నందిమళ్ల, సింగంపేట, మూలమల్ల తదితర గ్రామాల రైతులు వాపోయారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వచ్చి హామీ ఇస్తే తప్పా ఆందోళ విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ప్రాజెక్టు రహదారిపై వందలాది వాహనాలు బారులు తీరాయి. సమాచారం తెలుసుకున్న అమరచింత, ధరూరు పోలీసులు ఆందోళకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సాగునీటి విడుదలపై స్పష్టమైన హామీ ఇస్తేనే తాము ఆందోళ విరమిస్తామని రైతులు తేగేసి చెప్పడంతో కొంత ఉద్రిక్తత చోటుచేసుకున్నది. పోలీసులు వనపర్తి, గద్వాల జిల్లా కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి పరిస్థితి వివరించారు. ఇందుకు వారు తొందరలోనే సమస్యను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తుమని హామీ ఇవ్వడంతో 24గంటల్లోగా సాగునీరు అందించకుంటే తమకు చావులే శరణ్యమని రైతులు హెచ్చరించి ఆందోళ విరమించారు.

ఆయకట్టు రైతులను ఆదుకోవాలి : చిట్టెం

జూరాల ఎడమ కాల్వ ఆయకట్టు కింద వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతుల బాధను అర్థం చేసుకొని సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఈఎన్సీ అధికారి అనిల్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సాగునీటి కోసం రాత్రి, పగలు తేడా లేకుండా కాల్వల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని, అయినా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. గతంలో జూరాల ప్రాజెక్టు సాగునీటి విడుదలపై ప్రత్యేకంగా ఒక అధికారి ఉండేవారని, కాంగ్రెస్ హయాంలో రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు.

జూరాల కాల్వ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

జూరాల మోటర్ల వద్ద పడిగాపులు

అమరచింత, మస్తీపుల్, నందిమళ్ల, సింగంపేట, మూలమళ్ల తదితర గ్రామాల రైతులతో పాటు ఆత్మకూర్ మండలంలోని ఆరెపల్లి, కత్తెపల్లి, గుంటిపల్లి, మోట్లంపల్లి తదితర గ్రామాల రైతులు సాగునీటి విడుదల కోసం రాత్రి 10గంటలు దాటినా జూరాల ఎడమ కాల్వ మోటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల మాటలు నమ్మి నీళ్లొస్తాయని వందల ఎకరాల్లో సాగుచేసి చివరికి కండ్ల ముందే పంటలు కోల్పోవాల్సివస్తుందని వాపోయారు.

తాగు, సాగునీటికి గోస పడుతున్నాం

- అధికారులకు చెప్పినా పట్టింపు కరువు
- సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పెబ్బేరు, ఏప్రిల్ 15 : తాగు, సాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. పెబ్బేరు మండలం తోమాలపల్లెలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం విద్యుత్ సమస్యలపై రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ అసంపూర్తి నిర్మాణం వల్ల రాంపురం, కొత్తూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటితో పాటు వ్యవసాయానికి నీళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సాగునీరు లేక ఇప్పటికే పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయని, బోరుబావుల నుంచి ఉన్న కొద్దిపాటి నీటినైనా విని యోగించుకుందామంటే కరెంట్ సమస్యతో సతమతమవుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఈ టీచర్ మాకొద్దు

నాగనూలు కస్తూర్బా ఎదుట భోజనం చేయకుండా ధర్నా చేస్తున్న విద్యార్థినులు

- సస్పెండ్ చేయాలని మండుటెండలో కస్తూర్బా విద్యార్థినుల ధర్నా

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 15 : ఈ టీచర్ మాకొద్దంటూ నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని నాగనూలు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంగ్లిష్ టీచర్ కల్యాణి వేధింపులను నిరసిస్తూ మరో సారి విద్యార్థినులు మంగళవారం ఆందోళ చేపట్టారు. పది రోజుల కిందట టీచర్ కల్యాణి వేధింపు భరించలేక 9వ తరగతి విద్యార్థిని తన చేయి కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తీరుమార్చుకోకుండా తమను వేధిస్తున్నదంటూ విద్యార్థినులు ఆందోళ వ్యక్తం చేశారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడాన్ని నిరసిస్తూ ఎండలోనే ధర్నాకు దిగారు. మేడమ్ మమ్మల్ని టార్చర్ చేస్తున్నదని, స్నానం చేస్తుంటే ఫొటోలు తీసి ఎవరికో పంపుతుందని, చదవక పోతే గొంతు పట్టుకొని హింసిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 3గంటలపాటు విద్యార్థినుల తరగతులను బహిష్కరించారు. టీచర్‌ను సస్పెండ్ చేసే వరకు ఎట్టి పరిస్థితుల్లో క్లాసులోకి వెళ్లమని, భోజనం చేయమని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న డీఈవో రమేశ్‌కుమార్ విద్యార్థినులకు నచ్చజెప్పారు. టీచర్ కల్యాణిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. విద్యార్థినులు తమకు పెడుతున్న ఇబ్బందులను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లినా టీచర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు ఉన్నాయని చెప్పినా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గోపాల్‌పేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

సభ సక్సెస్ చేయాలి

- గులాబీ జాతరకు భారీగా తరలాలి
- ప్రతి పల్లెలో పార్టీ జెండా ఎగరాలి
- రాష్ట్ర ప్రయోజనాలే కేసీఆర్ లక్ష్యం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, ఏప్రిల్ 15 : తెలంగాణ ప్రజలకు గులాబీ జెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన మంగళవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేటలోని పద్మావతి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ప్రయోజనాల కోసమే కేసీఆర్ పార్టీని స్థాపించారని తెలిపారు. నాటి నుంచి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు పాటు పడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర సాధన కోసం పదువులను లెక్కచేయలేదని, చావుదాకా వెళ్లి తెలంగాణను సాధించినట్లు గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని గులాబీ జెండా ఎగురవేసి సభకు బయలుదేరాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా వరంగల్ సభ ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ అశోక్, డీసీఎం ఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు తిరుపతియాదవ్, మాజీ గ్రామ అధ్యక్షుడు మన్యంనాయక్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ మందా తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, శేఖర్‌యాదవ్, వెంకటయ్య, శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్‌గౌడ్, ఎండీ మతీన్, సునీల్, శేషి రెడ్డి, రవి, శ్రావణ్, నాగరాజు, శరత్, కృష్ణారావు, రాజు, ఓంకార్, వెంకట యయ్యగౌడ్, రాంబాబు, మొగులయ్య, శ్రీని వాస్‌రెడ్డి, కాశీనాథ్, శేఖర్‌గౌడ్, శరత్ బాబు, సురేందర్, మనేశ్, శివకుమార్, మన్సూర్, రాములు, శివకుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో జరిగిన సమావేశానికి హాజరైన శ్రేణులు

వర్షార్పణం

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో అకాల వర్షం
- రైతుల ఉరుకులు, పరుగులు
- నేలకొరిగిన వరి, రాలిన మామిడి
- పలుచోట్ల కూలిన విద్యుత్ స్తంభాలు
- కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

మూసాపేట/నవాబ్‌పేట/కల్వకుర్తి/వెల్దండ/హన్వాడ/మరికల్, ఏప్రిల్ 15 : వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. వ్యయప్రయాసాలకోర్చి సాగు చేసిన పంటలు నీటిపాలయ్యాయి. ఉమ్మడి పాలమూరులో మంగళవారం సాయంత్రం వడగండ్లతో భారీ వర్షం కురిసింది. దీంతో వరిపంటలు నేలకొరగగా, మామిడి రాలిపోయింది. జొన్న, మొక్కజొన్న ఇతర పంటల రైతులు నిండా మునిగారు. ఇప్పటికే వరికోతలు కోసి ఒడ్లు ఆరబెట్టగా, అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ధాన్యాన్ని పంటలను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో వరి ధాన్యం వరద పాలైంది. మూసాపేటతోపాటు వేముల, కొమిరెడిరెడ్డిపల్లి, దాసరిపల్లి, తుంకినీపూర్, జానంపేట తదితర గ్రామల్లో ధాన్యం తడిసిపోయింది. వేములకు చెందిన వెంకటయ్య అనే రైతు ఎనిమిది ఎకరాల్లో వరి సాగుచేయగా, కోతకోసి ఆరబెట్టాడు. అధికారులు ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం కోట్టుకుపోయి నష్టం మిగిలింది. మూసాపేట మండలం వేములకు చెందిన అయ్యమ్మ(50) తన పొలంలో కోసిన వరిధాన్యాన్ని గ్రామ శివారులోని కోజెంట్ పరిశ్రమ వద్ద ఉన్న రోడ్డుపై ఆరబోయగా, ఈదురుగాలులతో కూడా వర్షం రావడంతో సమీపంలో ఉన్న రేకులడబ్బా గాలికి కొట్టుకొచ్చి అమెపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు, మూసాపేట తాసీల్దార్ రాజు విచారణ చేపట్టారు. నవాబ్‌పేట మండలంలోని రుద్రారం, కొండాపూర్, చాకలిపల్లి, కేశవరావుపల్లి, బట్టోనిపల్లితండా తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించింది. రుద్రారంలో 70ఎకరాలు, కొండాపూర్‌లో 40, చాకలిపల్లిలో 50, కేశవరావు పల్లిలో 30, బట్టోనిపల్లితండాల్లో 40 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. పలు గ్రామాల్లో చెట్లు విరిగి కరెంట్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కల్వకుర్తి మండలం తాండ్ర రెవెన్యూ గ్రామ పరిధిలో వరిపంటలు దెబ్బతిన్నాయి. ఆకుతోట బావి, మర్రిగడ్డ, మేరోనిగడ్డ, నక్కరి చెరువు వద్ద కురిసిన వడగవడ్ల వర్షానికి 80ఎకరాల్లో పంటకు నష్టం చేకూరింది. వెల్దండ మండలంలో ఈ దురుగాలులుతో కురిసిన వర్షానికి మామిడి కాయలు నేలరాలగా, బండోన్‌పల్లి, కొత్రలో వడగండ్ల వానతో ధాన్యం నేలపాలైంది. బండోన్‌పల్లిలో 36 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగింది. వెల్దండలో రైతు గణేశ్‌కు మామిడి రైతు తోటలో మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. అధికారులు దెబ్బతిన్న వరిపంటలను పరిశీలించారు. హన్వాడ మండలం దాచక్‌పల్లికి చెందిన వడ్డె మాసయ్య పొలం వద్ద గేదెలను కట్టేసి ఉంచగా, పిడుగుపడి రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. టంకరలో ఈదురుగాలులకు చెట్లు విరిగి వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరికల్ మండల కేంద్రంలో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీకి విద్యుత్ వైర్లు తగిలి వైర్లు తెగిపడ్డాయి. లారీపై ఉన్న ఇద్దరు వెంటనే కిందకు దూకడంతో పెనుప్రమాదం తప్పింది.

నవాబ్‌పేటలో వడగండ్లతో దెబ్బతిన్న వరి పంట, కురిసిన వడగండ్లు — డబ్బ మీదపడి మృతిచెందిన మహిళ

కౌలు రైతు కన్నీరు

- నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- 4 ఎకరాల్లో కాలిబూడిదైన మొక్కజొన్న

కంచుపాడులో పూర్తిగా కాలిపోయిన మొక్కజొన్న కుప్ప

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 15 : వ్యయప్రయాసాలకోర్చి సాగు చేసిన మొక్కజొన్న పంటను కోసి కుప్పగా పోయగా, గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో 40 క్వింటాళ్లు పంట నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు ఉండవల్లి మండలం కంచుపాడుకు చెందిన అచ్చెన్న అదే గ్రామంలో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగుచేశాడు ఇందుకు రూ.2లక్షలు ఖర్చయ్యింది. సోమవారం కూలీలతో కలిసి 4ఎకరాల్లో మొక్కజొన్న కంకులను తెంపి పొలంలోనే మిషన్‌కు వేసేందుకు కుప్పగా పోశారు. మంగళవారం తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు మొక్కజొన్న కంకులను నిప్పుపెట్టడంతో 40క్వింటాళ్లు కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న అచ్చెన్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. కౌలుకు తీసుకొని అప్పులు చేసి పంట పండిస్తే బూడిద పాలైందంటూ కన్నీరు పెట్టుకున్నారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు మొక్కజొన్నకు పెట్టిన నిప్పు కారణంగా పొలం పరిధిలోని 100 ఎకరాల్లో ఇతర పొలాల గెట్లకు నిప్పంటుకున్నది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కార్తీక్‌చారి, అరవిందాచారి(ఫైల్)

చారకొండ, ఏప్రిల్ 15 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రం సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. కల్వకుర్తికి చెందిన కార్తీక్‌చారి(35), అరవిందాచారి(34) ఇద్దరూ వ్యక్తిగత పని నిమిత్తం దేవరకొండకు వెళ్లి తిరిగి కల్వకుర్తికి వస్తుండగా డిండి మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో నర్సరీ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, బైక్ అదుపుతప్పి పడ్డారా లేదా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందా అనేది తెలియరాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు కార్తీక్‌చారి సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా, అరవిందాచారి కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్ వెనుక హోటల్ నిర్వహిస్తున్నాడు.

దండులా కదలాలి

- దారులన్నీ బీఆర్ఎస్ రజతోత్సవ సభకే సాగాలి
- ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరవేయాలి
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 15 : స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన భారత రాష్ట్ర సమితి రజతోత్సవ వేడుకలకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మంగళవారం అచ్చంపేటలోని తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం గులాబీ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలబడుతుందని చెప్పారు. రజతోత్సవ సభకు తరలించేందుకు వాహన, భోజన వసతి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభకు తరలించే రోజునే ప్రతి గ్రామంలో గులాబీ జెండాను ఎగుర వేయాలని సూచించారు. అనంతరం రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అమీనొద్దీన్, కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల, నేతలు

సభకు భారీగా తరలిరావాలి

- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

మహ్మదాబాద్, ఏప్రిల్ 15 : ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గండీడ్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా రజతోత్సవ సభకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు రాబోవు రోజుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. రజతోత్సవ సభకు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని, ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఎగుర వేయాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

నడింపల్లిలో వ్యక్తి దారుణహత్య

- తృటిలో తప్పించుకున్న అతడి కొడుకు
- మహిళతో చిన్న కుమారుడి వివాహేతర సంబంధమే కారణంగా అనుమానం
- నిందితులను అరెస్టు చేయాలని రాస్తారోకో

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 15 : బైక్‌పై పెద్ద కొడుకుతో కలిసి వస్తున్న తండ్రిపై గుర్తు తెలియని వ్యక్తులు కారుతో అడ్డగించి గొడ్డలి, సుత్తెలతో దాడులు చేయగా.. ఒకరు మృతి చెందగా.. మరొకరు తృటిలో తప్పించుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. అచ్చంపేట మండలంలోని నడింపల్లికి చెందిన బూరం వీరయ్య (55)కు ఇద్దరు కుమారులు కాగా రెండో వాడు అవివాహితుడు. అయితే అదే గ్రామానికి చెందిన ఇద్దరు సంతానం ఉన్న మహిళతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడు. నెల రోజుల కిందట సదరు మహిళను ఎవరికి తెలియకుండా ఏపీలోని గురజాల తీసుకెళ్లాడు. ఎలాగో అలాగా మహిళ ఆచూకీ తెలుసుకొన్న ఆమె భర్త, తమ్ముళ్లు అక్కడకు వెళ్లి యువకుడిని చితకబాదడంతోపాటు మహిళను అక్కడి నుంచి సొంతూరికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకొన్న యువకుడి తండ్రి వీరయ్య దాడి చేసిన వారిపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే గ్రామంలో పెద్ద సమక్షులోనే సమస్యను పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో గ్రామంలో పంచాయితీ పెట్టగా ఇకపై ఇద్దరూ ఒకరినొకరు కలవవద్దని పెద్దలు తీర్మానించారు. అయినా వారు వివాహేతర సంబంధాన్ని అలాగే కొనసాగించారు. దీంతో ఆగ్రహంతో మహిళ కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పెద్ద కొడుకుతో కలిసి వీరయ్య మోటర్‌బైక్‌పై అచ్చంపేటకు వెళ్తుండగా.. ఇటుక బట్టీ సమీపంలో కాపు కాచిన గుర్తు తెలియని వ్యక్తులు కారుతో వీరిని అటకాయించారు. కండ్లల్లో కారం చల్లి గొడ్డలి, సుత్తెతో దాడి చేసి వీరయ్య హతమర్చారు. కొడుకు తృటిలో తప్పించుకున్నాడు. విషయం తెలుసుకొన్న ఎస్సై రమేశ్, కానిస్టేబుల్ మహేశ్‌ను వెంట పెట్టుకొని ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించారని, దీంతో నేడు నిండుప్రాణం బలైందని కుటుంబ సభ్యులు ఎస్సైని నిలదీశారు. నడింపల్లి గ్రామ అల్లుడు మహేశ్ వీరి వివాహేతర సంబంధాన్ని ప్రోత్సహించాలని దుమ్మెత్తి పోశారు. ఆగ్రహం తట్టుకోలేక కానిస్టేబుల్ మహేశ్‌పై దాడికి యత్నించగా.. ఎస్సై సహకారంతో బస్సెక్కి అక్కడి నుంచి తప్పించుకున్నాడు.

రోడ్డుపై కంప వేసి ఆందోళన

అచ్చంపేట-నడింపల్లి రహదారిపై వీరయ్య మృతదేహాన్ని ఉంచి బంధువులు, గ్రామస్థులు ఆందోళకు దిగారు. రోడ్డుకు అడ్డంగా కంప వేసి 4 గంటల సేపు రాస్తారోకో చేపట్టారు. నిందితులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకొన్న డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్సై వెంకటిరెడ్డి అక్కడికి చేరుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. వీరయ్య మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు సహకరించాలని, వెంటనే ఆందోళన విరమించాలని డీఎస్పీ సూచించారు. దీంతో వారు శాంతించడంతో దవాఖానకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్లో వీరయ్య(ఫైల్)